సాక్షి ఒడిశా

గురువారం । 17 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.7,18,889
బంగారం	121 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
వెండి	472 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



రాష్ట్రానికి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్ రెండు రోజుల రాష్ట్ర పర్యటనకు బుధవారం విచ్చేశారు.

- 8లో.



వైభవంగా సాగర్ విజే

పూరీ జగన్నాథ ఆలయ పరంపర ప్రకారం బుధవారం సాగర్ విజే ఉత్సవం వైభవంగా నిర్వహించారు. స్వర్గ ద్వారం తీరంలో సముద్ర జలం సేకరించి బహిరంగంగా స్వామివారికి ప్రత్యేకంగా పూజార్చనలు నిర్వహించారు.

- 8లో.

న్యూస్‌రీల్

'బీఎంసీలో విలీనం చేయండి'



కమిషనర్ సోనాలీ జెన్నాకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బరంపురం: బరంపురం మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్ హోదా పొంది సుమారు 10 ఏళ్లు గడుస్తున్న తరుణంలో డీ లిమిటేషన్ ప్రకారం బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) వార్డుల విభజన మూడోసారి జరిగింది. ఈ నేపథ్యంలో బరంపురం నగరం చుట్టుపక్కల ఉన్నటువంటి 40 పంచాయతీలను హైకోర్టు ఆదేశాల మేరకు కార్పొరేషన్‌లో విలీనం చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతిపాదించింది. అనంతరం వినతపత్రాన్ని కమిషనర్ సోనాలీ జెన్నాకి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గంజాం జిల్లా ఆప్ అధ్యక్షుడు అధిత్య రథ్, కార్యదర్శి సత్య ప్రకాష్ సెఠి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యునిగా సంజీత్ పాణిగ్రాహి



సంజీత్ పాణిగ్రాహి

బరంపురం: ఒడిశా రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యునిగా సంజీత్ పాణిగ్రహి ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఎన్నికలో 25 మంది బార్ న్యాయవాదులు పోటీపడగా, గంజాం బార్ న్యాయవాదుల సంఘంలో పేరుగాంచిన సంజీత్ పాణిగ్రహి విజయం సాధించారు. ఈయన బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ 22వ వార్డు కార్పొరేటర్‌గా ఉన్నారు. గంజాం జిల్లా బీజేడీ నాయకుడుగా పార్టీకి ఎనలేని సేవలందిస్తున్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యునిగా సంజీత్ పాణిగ్రహి విజయం సాధించడంతో బీజేడీ నాయకులు, న్యాయవాదులు అభినందనలు తెలియజేశారు.

గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితులతో పోలీసులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ పోలీసులు మంగళవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా ఒక బైక్‌పై తరలిస్తున్న 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పద్మపూర్ పోలీసుస్టేషన్ పరిధి కెందుగుడ కూడలిలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్‌పై గంజాయిని తరలిస్తున్న భొత్రా, టుకునలను పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.4,800 నగదుతో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చసుకున్నారు. అలాగే బైక్‌ను సీజ్ చేశారు.

ఇద్దరు ఖైదీలకు విముక్తి



జైలు నుంచి సత్ప్రవర్తనతో విడుదలైన ఖైదీలు

కొరాపుట్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలకు అనుగుణంగా కొరాపుట్ జిల్లా కేంద్ర కారాగారం నుంచి ఇద్దరు ఖైదీలకు విముక్తి లభించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా కొరాపుట్ జైలులో ఈ పరిణామం చోటుచేసుకుంది. కొరాపుట్ జిల్లా కుంద్రా సమితికి చెందిన క్రుతివాస్ బోత్ర, లక్ష్మీపూర్ సమితికి చెందిన అంకొకొలకాలు చిన్న నేరాలకు 2 సంవత్సరాల జైలు శిక్షకి గురయ్యారు. జైలుకి వచ్చిన నాటి నుంచి సత్ప్రవర్తనతో మెలిగారు. వారి క్రమశిక్షణతో జైలు సూపరింటెండెంట్ మనోరంజన్ ప్రత్యారి సానుకూల నివేదికను ప్రభుత్వానికి పంపించారు. దీంతో ప్రభుత్వ ఆదేశాలతో వీరిద్దరినీ విడుదల చేశారు. విడుదల సమయంలో తోటి ఖైదీలు, జైలు సిబ్బంది వీరిద్దరికీ అభినందనలు తెలిపారు.

లైన్ క్లియర్

- తూర్పు కోస్తా రైల్వేలో 3వ లైన్‌కు కేంద్రం ఆమోదం
- వ్యయ ప్రణాళిక రూ.5,618 కోట్లు
- అదనపు సరుకు రవాణాతో అధిక ఆదాయం అంచనా



భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే పరిధిలో 3వ రైలు లైను నిర్మాణానికి కేంద్ర మంత్రి మండలి బుధవారం ఆమోదం తెలిపింది. ఈ లైను నెరుగుండి - బారంగ్ మరియు ఖుర్దా రోడ్ - విజయనగరం గుండా నిర్మితమవుతుంది. ఈ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పీఎం గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ మల్టీ మోడల్ కనెక్టివిటీ పథకం కింద ఈ పనులు చేపడతారు. వీటి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు వెచ్చిస్తుంది.

ఒత్తిడి నివారణే లక్ష్యం

తూర్పు కోస్తా రైల్వే జోన్‌లోని భద్రక్-విజయనగరం సెక్షన్‌లో నెరుగుండి-బారంగ్ మరియు ఖుర్దా రోడ్-విజయనగరం మార్గం నిత్యం అత్యధిక రవాణాతో ఒత్తిడికి గురవుతోంది. ఈ మార్గంలో 137 శాతం లైన్ కెపాసిటీ వినియోగంతో కిటకిటలాడుతోంది. తద్వారా తరచూ రైలు కార్యకలాపాలకు అడ్డంకి తలెత్తుతోంది. ఈ పరిస్థితుల నివారణకు కేంద్ర మంత్రి మండలి ఆమోదించిన 3వ లైనుతో మార్గం సుగమం అవుతుంది. రైల్వే శాఖ మరింత లాభసాటిగా ముందుకు దూసుకుపోయేందుకు 3వ లైను వారధిగా నిలుస్తుంది.

లాభసాటి ప్రాజెక్టు

తూర్పు కోస్తా రైల్వే భద్రక్-విజయనగరం సెక్షన్‌లోని నెరుగుండి-బారంగ్ మరియు ఖుర్దా రోడ్-విజయనగరం 3వ లైను నిర్మాణం బహుముఖ ప్రయోజకరంగా నిలుస్తుంది. ఒడిశాలో 184 కిలో మీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో 201 కిలోమీటర్లు సమగ్రంగా 385 కిలోమీటర్ల పొడవునా నిర్మితం కానున్న ఈ ప్రాజెక్టు వ్యయ ప్రణాళిక రూ.5,618 కోట్లు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ప్రత్యక్షంగా లబ్ధి పొందుతాయి. ఒడిశాలో భద్రక్, జాజ్‌పూర్, ఖోర్ధా, కటక్, గంజాం మరియు ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల గుండా ఈ లైను నిర్మాణం కొనసాగుతుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా నదులపై 6 ముఖ్యమైన ప్రధాన వంతెనలు నిర్మిస్తారు.



కేంద్ర కేబినెట్ ఆమోదం పొందిన తూర్పు కోస్తా రైల్వేలో 3వ లైను ప్రాజెక్టు మ్యాప్

నది	వంతెన పొడవు (మీటర్లలో)
బిరూపా	488
మహానది	2,096
కఠాజొడి	822
రుషికుల్య	457
వంశధార	410
కువాఖాయి	822

పరిశ్రమలకు లాభదాయకం

నిర్మాణానికి ఆమోదం పొందిన 3వ అదనపు రైలు లైను ట్రాఫిక్ రద్దీ నియంత్రించడంతో పాటు సరుకు వేగవంతమైన రవాణాకు మరింత వెసులుబాటు కల్పిస్తుంది. ఈ మార్గంలో బొగ్గు, సిమెంట్, ఇనుప ఖనిజం, ఉక్కు, ఎరువులు, చమురు మొదలైన సరుకు రవాణా గణనీయంగా పెరిగి తూర్పు కోస్తా రైల్వే వార్షిక ఆదాయం వృద్ధికి దోహదపడుతుంది. అదనపు లైను అందుబాటులోకి రావడంతో ఏటా అదనంగా 78.79 మెట్రిక్ టన్నుల సరుకుల రవాణాకు అవకాశం బలపడుతుంది. ఒడిశా, ఆంధ్ర ప్రదేశ్ ప్రాంతాల్లో పారిశ్రామిక సంస్థలు, కార్ఖానాలు, ఓడ రేవులకు ఈ ప్రాజెక్టు ఉపకరిస్తుంది. ఒడిశాలో తాల్చేర్ గనుల నుంచి బొగ్గు దక్షిణ భారతదేశానికి వేగవంతంగా రవాణా అవుతుంది. రాష్ట్రంలో పారాదీప్, గోపాల్‌పూర్ పోర్టుల నుంచి ఉక్కు కర్మాగారాలకు బొగ్గు రవాణాకు రైలు అనుసంధానం సులభతరం అవుతుంది. పారాదీప్ పోర్ట్ నుంచి సిమెంట్ కార్ఖానాలకు క్లింకర్, పెట్‌కోక్ తదితర ముడి సరుకులు రవాణా పుంజుకుంటుంది. వివిధ ఉక్కు కర్మాగారాల నుంచి ఉక్కు ఎగుమతి ఎదుగుదలకు దోహదపడుతుంది. కెంజొహర్ జిల్లాలో గనుల నుంచి వివిధ ఓడరేవులకు ఇనుప ఖనిజం వేగంగా తరలించడంతో పారిశ్రామిక సంస్థల ఉత్పాదన వేగం పుంజుకుంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం మరియు గంగవరం ఓడరేవుల నుంచి ఒడిశాలోని ఉక్కు కర్మాగారాలకు బొగ్గును సజావుగా రవాణా చేయడం సాధ్యం అవుతుంది.

ప్రయాణికులకు అదనపు సౌకర్యాలు

నెరుగుండి – బారంగ్ మరియు ఖుర్దా రోడ్ – విజయనగరం 3వ లైను నిర్మాణంతో ఒడిశా, ఆంధ్రప్రదేశ్ గుండా ప్రయాణానికి మరిన్ని రైలు సర్వీసులు అందుబాటులోకి వస్తాయి. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక రైలు సేవలు అమలుకు ఉపకరిస్తుంది.

కొఠియాను అభివృద్ధి చేస్తాం



కొఠియాలో నాయకులతో మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వయ్

- మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వయ్

కొరాపుట్: ఆంధ్రా–ఒడిశా వివాదస్పద ప్రాంతం కొఠియాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వయ్ తెలియజేశారు. కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొఠియా పంచాయతిలో బుధవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. అక్కడ జన్నిగుడలో సాగుచేస్తున్న స్ట్రాబెర్రీ పంటను పరిశీలించారు. స్ట్రాబెర్రీకి జాతీయ స్థాయిలో మంచి ధర లభించేటట్లు చేస్తామని హామీ ఇచ్చారు. చిరుధాన్యాలు ఉత్పత్తి చేసే రైతులను కలిసి మాట్లాడారు. పంటసాగుకు ఆర్థిక సాయం చేస్తామని తెలియజేశారు. అరటి తోటల నిర్వహణ, అందుతున్న సాయం అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు లక్ష్మీపూర్ సమితిలో పలు వ్యవసాయ క్షేత్రాలు పరిశీలించారు. అనంతరం సిమిలిగుడలో వ్యవసాయ మార్కెట్ భవనం ప్రారంభించారు. సాయంత్రం కొరాపుట్ జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయనతో పాటు జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలక తదితరులు ఉన్నారు.



అరటి తోటలను పరిశీలిస్తున్న మంత్రి రణేంద్ర

హస్తినకు గ్రామాల్లో సేకరించిన మట్టి



మట్టితో నిండిన కలశాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

రాయగడ: ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన మేరీ మట్టి–మేరా దేశ్ కార్యక్రమానికి సంబంధించి అన్ని పంచాయతీల్లో సేకరించిన మట్టిని హస్తినకు పంపించే కార్యక్రమానికి రాయగడ సమితి శ్రీకారం చుట్టింది. సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక నేతృత్వంలో స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. వివిధ ప్రాంతాల మట్టిని కలశంలో నింపి ఊరేగింపుగా బయల్దేరారు. అనంతరం డీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ అధికారులు మాట్లాడుతూ.. మట్టిని ముందుగా భువనేశ్వర్ పంపిస్తామని, అనంతరం అక్కడి నుంచి ఢిల్లీకి చేరుస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో బీడీవో లక్ష్మీనారాయణ సాబొతా, అసిస్టెంట్ బీడీవో కాళీచరణ్ నాయక్, సమితి వైస్ చైర్మన్ హరప్రసాద్ హెప్రుక తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసు ఛేదించిన పోలీసులు



అరెస్టు చేసిన తిరుపతి నాయుడును చూపిస్తున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న వస్తువులు, నగదు

కొరాపుట్: ఇటీవల నబరంగపూర్ జిల్లా కేంద్రంలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర పోలీసుస్టేషన్ ఆవరణలో ఎస్‌డీపీవో నిరంజన్ ప్రధాన్ కేసు వివరాలను బుధవారం తెలియజేశారు. ఈనెల 9వ తేదీన కేవిడి వీధి సమీపంలో పాత డైలీ మార్కెట్ రోడ్డులోని ఎం.భారతీ నివాసంలో చోరీ జరిగింది. ఆ సమయంలో ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేరు. కుటుంబ సభ్యులు తిరిగి ఇంటికి వచ్చే సమయంలో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి ప్రత్యేక దర్యాప్తు చేశారు. దీనిలో భాగంగా బంగారమ్మ కాలనీలో జాతీయ రహదారికి పక్కన వాహన మరమ్మతులు చేపట్టే బి.తిరుపతి నాయుడు దొంగతన చేసినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి బంగారం వస్తువులు, రెండు టీవీలు, రూ.14,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి జైలుకి తరలించారు.

ప్రజలకు అండగా బీజేడీ ప్రభుత్వం

- మంత్రి జగన్నాథ సరక



బిడిక అనే మహిళకు చెక్కు అందిస్తున్న మంత్రి సరక

రాయగడ: పేద ప్రజలకు బీజేడీ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి జగన్నాథ సరక అన్నారు. జిల్లాలోని మునిగుడలో బిజు పట్నాయక్ కల్యాణ మండపంలో నిర్మాణ శ్రామికుల కల్యాణ యోజన పథకం లబ్ధిదారులకు ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని ప్రజలు అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ పథకంలో భాగంగా కుముదుని బిడిక అనే మహిళ భర్త ప్రమాదవశాత్తు మరణించడంతో ప్రభుత్వ సాయం కింద రూ.2.05 లక్షల చెక్కు, అదేవిధంగా మరొకరికి ఆడపిల్ల వివాహం కోసం రూ.50 వేలు, అదేవిధంగా ప్రసవం కోసం ఇంకొకరికి రూ.10 వేలు, చదువుల కోసం మరొకరికి రూ.5 వేల సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కార్మిక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై కత్తితో దాడి..?

జయపురం: స్థానిక విక్రమదేవ్ స్వయం పాలిత కళాశాలకు చెందిన విద్యార్థినిపై ఒక యువకుడు దాడిచేసి, కత్తితో పొడిచినట్లు సమాచారం. బుధవారం ఈ ఘటన జరగగా సదరు విద్యార్థిని +2 చదువుతున్నట్లు తెలిసింది. కత్తిపోటుకు గురైన విద్యార్థిని ప్రస్తుతం స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.

భూటన్ అథ్లెటిక్స్‌కు కిశోర్‌చంద్ర



హైదరాబాద్‌లో బంగారు పతకంతో కిశోర్ రథ్

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఎక్సైజ్ శాఖ మాజీ ఎస్‌ఐ కిశోర్ చంద్రరథ్ 24వ అంతర్జాతీయ భూటాన్ అథ్లెటిక్స్ గేమ్స్–2023కి ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 5వ ఆల్ ఇండియా మాస్టర్ గేమ్స్‌లో లాంగ్ రన్, ట్రిపుల్ జంప్‌లో కిశోర్ చంద్ర గోల్డ్ మెడల్స్ సాధించారు. అందుకు ఆయనను మంగళవారం జిల్లా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ సత్కరించారు. జిల్లా ఎక్సైజ్ శాఖలో పనిచేసిన ఆయన గతనెలలో పదవీ విరమణ పొందారు. ఆయన మరిన్ని అంతర్జాతీయ బహుమతులు సాధించాలని జిల్లా ఎక్సైజ్ శాఖ ఎస్పీ అభిరాం బెహరా తదితరులు అభినందనలు తెలిపారు.

సజావుగా దిశ సమీక్ష సమావేశం



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అభివృద్ధి, సమన్వయ మానిటరింగ్ కమిటీ(దిశ) సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ చంద్రశేఖర సాహు హాజరవ్వగా, కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బిజూ కల్యాణ స్వస్థ యోజన ఆరోగ్య శ్రీ కార్డులు, వివిధ శాఖల్లో భర్తీ కాకుండా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధి హామీ పథకం తదితర 33 పథకాలపై ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు మాట్లాడారు. సమావేశంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతి రావు, ఎస్డీసీ చైర్మన్ మరియం రైతో, మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠి, డీఆర్‌డీఏ ముఖ్య కార్య నిర్వహణ అధికారి గుణనిధి నాయక్, సీడీఎంవో డా.ప్రదీప్ కుమార్ పాత్రో, గుసాని సమతి చైర్మన్ ఎన్.వీర్రాజు, కాశీనగర్ సమితి చైర్మన్ బల్ల శాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొట్లాట కేసులో ముగ్గురు అరెస్టు



మహేష్ బొడొపాడియ



నారాయణ బొడొపాడియ



సుందర బొడొపాడియ

జయపురం: ఇంటి నిర్మాణం విషయంలో తలెత్తిన వివాదంలో ఒక వ్యక్తిపై దాడిచేసి, తీవ్రంగా గాయపరచిన ముగ్గురు అన్నదమ్ములను అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి బుధవారం వెల్లడించారు. ఈ ఘటనపై భరిణీపుట్ గ్రామానికి చెందిన తిలా బొడొపాడియ కుమారుడు సునాదర బొడొపాడియ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన బంధువు డొమై బొడొపాడియ అనేవ్యక్తి గ్రామానికి చెందిన డొంబురు బొడపాడియ ఇంటి పక్కన ఉన్న తన స్థలంలో ఇల్లు నిర్మించుకుంటున్నాడని, అయితే అది వివాదస్పద స్థలం కావడంతో డొంబురు బొడపాడియ కుటుంబ సభ్యులు అభ్యంతరం తెలిపారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అనంతరం మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో డొంబురు బొడపాడియ కుటుంబ సభ్యులు కత్తులు, కర్రలు, ఇనుప రాడ్లు, మిరప గుండతో తన బంధువు డొమై బొడొపాడియ ఇంటిలోకి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. డొంబురు బొడపాడియ కుమారులు మహేష్ బొడొపాడియ(23), నారాయణ బొడొపాడియ(23), సుదర బొడొపాడియ?(25), రామ బొడొపాడియ(30)లు వారిని కొట్టడంతో పాటు కారం చల్లారని తెలిపారు. మారణాయుధాలతో దాడి చేయడంతో తన డొమై బొడొపాడియ, పాడు బొడొపాడియాలకు తీవ్రగాయాలయ్యాయని, వారిలో పాడు బొడొపాడియ పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. దీంతో కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి వెల్లడించారు. అరెస్టైనవారిలో మహేష్ బొడొపాడియ, నారాయణ బొడొపాడియ, సుందర బొడొపాడియాలు ఉన్నట్లు తెలియజేశారు.

విష సర్పాల వ్యాపారం గుట్టురట్టు

- ముగ్గురు వ్యక్తులు అరెస్టు
- 26 పాములు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ డబ్బాల్లో ఉన్న నాగుపాములు

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా బలియాపాల్ తహసీల్ పంచుపాలి ప్రాంతంలో విష సర్పాల అక్రమ వ్యాపారం చేస్తున్న ముఠా గుట్టురట్టు అయ్యింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ఆధారంగా అనుబంధ వర్గాలు చేపట్టిన దాడిలో ఈ ముఠా వ్యవహారం బట్టబయలైంది. అటవీ శాఖ అధికారులు ఆకస్మికంగా చేపట్టిన దాడుల్లో బుధవారం 26 నాగుపాములను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ఒక మహిళ ఉన్నట్లు తెలిపారు. బాలాసోర్ జిల్లా లంగేశ్వర్ అటవీ కార్యాలయానికి సమీపంలోని ఈ అక్రమ వ్యాపార శిబిరం కొనసాగడం సంచలనం రేపింది. బాలాసోర్ అటవీ విభాగం మరియు స్నేక్ హెల్ప్‌లైన్ వర్గాలు ఉమ్మడిగా ఈ శిబిరంపై దాడి చేశాయి. పట్టుబడిన ముఠాలో ఉన్న దంపతులు అంతర్ రాష్ట్ర రాకెట్‌ను నడుపుతున్నట్లు తేలింది.

పలు ప్రాంతాలకు తరలింపు

రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పాములను సేకరించి వాటి విషాన్ని తీసి వివిధ ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ మేరకు స్నేక్ హెల్ప్‌లైన్ కార్యదర్శి సువేందు మల్లిక్ మీడియాతో మాట్లాడారు. నాగుపాముల అక్రమ వ్యాపారం (స్మగ్లింగ్) గురించి విశ్వసనీయ సమాచారం అందిందన్నారు. సమాచారం అందడంతో తక్షణమే భువనేశ్వర్ నుంచి తెల్లవారు జామున 3 గంటలకు బయల్దేరి విష సర్పాల అక్రమ వ్యాపార శిబిరానికి చేరినట్లు వివరించారు. విషయం స్థానిక అటవీ శాఖ అధికారులకు తెలియజేయడంతో వారు ప్రత్యక్షంగా రంగంలోకి దిగారన్నారు. వీరి ఆధ్వర్యంలో జరిగిన దాడిలో 26 నాగుపాములకు స్వేచ్ఛ కల్పించినట్లు పేర్కొన్నారు. పాములను రంధ్రాలతో ప్రత్యేకంగా రూపొందించిన ప్లాస్టిక్ కంటైనర్లలో అక్రమార్కులు బందీచేసి ఉంచినట్లు దృష్టికి వచ్చిందన్నారు. ఈ వ్యవహారంలో మరింత మంది వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతోందని బాలాసోర్ అటవీ విభాగం ఏసీఎఫ్ శోభన్ చాంద్ వెల్లడించారు.

క్లుప్తంగా

మాజీ ప్రధాని వాజపేయికి నివాళులు



వాజపేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ యువ మోర్చా నాయకులు

బరంపురం: భారత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజపేయి వర్ధంతి సందర్భంగా స్థానిక కోర్టుపేట జంక్షన్‌లో ఉన్నటువంటి జగన్నాథ్ మందిర ప్రాగణంలో జిల్లా బీజేపీ యువ మోర్చా అధ్వర్యంలో ఆయన చిత్రపటానికి బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువ మోర్చా అధ్యక్షుడు రామ్‌చంద్ర పాత్రో మాట్లాడుతూ వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు నేటి యువతకు అదర్శంగా నిలుస్తాయన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజేంద్ర సాహు, సునిల్ సాహు, టామన్నా పాఢి, సరత్ సాహు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 18 నుంచి కాంగ్రెస్ ఆందోళనలు



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక కాంగ్రెస్ భవన్‌లో గజపతి జిల్లా కాంగ్రెస్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆగస్టు 18న జిల్లాలోని అన్ని సమితి కేంద్రాల్లో మణిపూర్ ఘటనపై కేంద్రం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ఆందోళనలు చేపట్టనున్నట్లు నిర్ణయించారు. అంతేకాక రాష్ట్రంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, తన పార్టీ నాయకులు అనుసరిస్తున్న వైఖరిపై కూడా నిరసన తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని మోహనా, ఆర్.ఉదయగిరి, నువాగడ, రాయఘడ, గుసాని, గుమ్మా, కాశీనగర్ సమితి కేంద్రాల్లో ఆందోళనలు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు దాశరథి గొమాంగో, కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు బసంత పండా, మింటు పాణి, అభిమన్యు పండా, సూర్య నారాయణ పాత్రో, సంగ్రాం సాహు, రాజ పాత్రో, సంజయ్ కుమార్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ అవరణలో కొండచిలువ హతం



హతమైన కొండ చిలువ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఆవరణలో బుధవారం ఉదయం కొండ చిలువ కలకలం రేపింది. సెక్యూరిటీ సిబ్బంది స్పందించి కర్రలతో హతమార్చారు. కొండ ప్రాంతం కావటంతో వర్షాలకు బయటకు పాములు వస్తున్నాయని సిబ్బంది చెబుతున్నారు.

ఆర్ఎస్ఐ కుటుంబానికి సాయం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయంలో పనిచేసిన ఆర్ఎస్ఐ శేషయ్య ఈ నెల 14న అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన కుటుంబాన్ని ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాలమ మేరకు పోలీస్ అసోసియేషన్ సభ్యులు బుధవారం పరామర్శించారు. కుమార్తెలు సుధారాణి, మాధురిలకు పోలీస్ మరణ సహాయ నిధి నుంచి తక్షణ సహాయంగా రూ.లక్ష అందజేశారు. కార్యక్రమంలో అసోషియేషన్ సభ్యులు కృష్ణంనాయుడు, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖలింగేశ్వరున్ని దర్శించుకున్న ఇంజినీర్లు



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న కె.వి.కృష్ణారెడ్డి

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో మధుకేశ్వరున్ని బుధవారం గ్రామీణ నీటి సరఫరా విభాగం సీఎస్ఈ(ఇంజినీరింగ్ చీఫ్) కె.వి.కృష్ణారెడ్డి దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ విశేషాలు వివరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వీరితోపాటు చీఫ్ ఇంజినీర్ సంజీవ్ రెడ్డి, శ్రీకాకుళం, విజయనగరం ఎస్ఈలు టీఎస్ ప్రసాద్, ఉమాశంకర్, క్వాలిటీ కంట్రోల్ డీఈ ఎస్.రామకృష్ణ, డీఈ జల్లు సుదర్శనరావు, సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు కె.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాగర్ విజే



సాగర్ విజే మహోత్సవంలో జగన్నాథుని ప్రతినిధి నారాయణుడు



స్వర్గ ద్వార్ తీరానికి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం



సాగర తీరంలో సాగర్ విజే నిర్వహణ



శాస్త్రీయ రీతిలో సాగర్ విజే పూజాదులు నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: పూరీ జగన్నాథ ఆలయ పరంపర ప్రకారం బుధవారం సాగర్ విజే ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అమావాస్య పురస్కరించుకుని క్రమం తప్పకుండా ఈ ఉత్సవం నిర్వహించడం విశేషం. సాగర తీరంలో జరిగే ఈ ఉత్సవం సందర్శకులు, పర్యాటకులకు ప్రత్యేక దర్శన భాగ్యం కలిస్తుంది. శ్రీ జగన్నాథుని ఆజ్ఞామాల అందడంతో ఉత్సవమూర్తి నారాయణుడు పల్లకీలో సాగర తీరానికి ఊరేగింపుగా బయల్దేరాడు. స్వర్గ ద్వారం గుండా జరిగే ఈ ఊరేగింపు కనుల పండువుగా నిర్వహించారు. స్వర్గ ద్వారం తీరంలో సముద్ర జలం సేకరించి బహిరంగంగా స్వామివారికి ప్రత్యేకంగా పూజార్చనలు నిర్వహించడం విశేషం.

మజ్జిగౌరి ఆలయాభివృద్ధికి రూ.40 కోట్లు

- మెరుగైన వసతుల కల్పనకు నిధులు మంజూరు



మజ్జిగౌరి అమ్మవారు (ఫైల్)

రాయగడ: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా కొలవబడుతున్న మజ్జిగౌరి మందిరాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.40 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వం వెల్లడించింది. ఆంధ్ర, తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి భక్తులు ప్రతీ ఆది, మంగళ, బుధవారాల్లో ఈ ఆలయానికి పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఈ నేపథ్యంలో మెరుగైన వసతులు కల్పించేందుకు నిధులు మంజూరు చేసింది. జూన్ 7వ తేదీన 5టీ కార్యదర్శి వి.కార్తికేయ పాండ్యన్ రాయగడ పర్యటనలో భాగంగా మందిరం అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని ఇచ్చిన హామీ ప్రకారం, ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఇటీవల ఆలయానికి రైల్వేస్థలం

ఇదిలా ఉండగా మందిర ప్రాంగణం ఇప్పటివరకు రైల్వే స్థలంలో ఉండడంతో అభివృద్ధికి నోచుకోలేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు, కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, పట్టణ ప్రముఖుల వినతులకు ఇదివరకే ప్రభుత్వం స్పందించింది. ఈ క్రమంలో రైల్వే శాఖ ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేసి, రైల్వే స్థలానికి బదులు స్థలం ఇచ్చేందుకు అంగీకారం కుదుర్చుకుంది. మందిరం ప్రాంగణంలోని సుమారు 6.30 ఎకరాల భూమిని రెవెన్యూ శాఖకు రైల్వే మంజూరు చేసింది. 5టీ కార్యదర్శి పాండ్యన్ రాయగడ పర్యటనలో భాగంగా ఈ స్థలాన్ని ప్రభుత్వం తరుపున ఉచితంగా మందిరానికి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అనంతరం మందిరం అభివృద్ధికి కూడా ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. డిటెల్డ్ ప్రాజెక్టు రిపోర్టు ప్రకారం ఏఏ అభివృద్ధి పనులు చేపట్టాలనే వివరాలు తెలుస్తుంది. దీనికోసం కొద్దిరోజుల క్రితం డీపీఆర్ సర్వే పనులు కూడా ప్రారంభించారు. దీంతో మరో ఏడాదిలోగా మందిరం అత్యంత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. భక్తులకు మెరుగైన సౌకర్యాలతో విశ్రాంతి భవనాలు, క్యూ కాంప్లెక్స్, మరుగుదొడ్లు తదితర అత్యవసర అభివృద్ధి పనులు చేపట్టేందుకు మందిరం ట్రస్టు బోర్డు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

రాష్ట్రానికి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

- రెండు రోజుల రాష్ట్ర పర్యటన

భువనేశ్వర్: కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్ రెండు రోజుల రాష్ట్ర పర్యటనకు విచ్చేశారు. బుధవారం రాత్రి ఆమె భువనేశ్వర్ చేరారు. ఈ సందర్భంగా ఆమెకు స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సీనియర్ బీజేపీ నాయకులు మరియు అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి మంత్రి నేరుగా స్థానిక రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యాలయానికి చేరారు. ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నివేదిత ప్రధాన్ శ్రద్ధాంజలి సభా కార్యక్రమంలో పాల్గొన్నారు. కటక్ తొలి మహిళా మేయర్, సీనియర్ నాయకురాలు, ప్రముఖ న్యాయవాది నివేదిత ప్రధాన్ స్మృతి పురస్కరించుకుని ఈ సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కేంద్ర విద్య మరియు నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పాల్గొన్నారు.

నేడు పూరీ సందర్శన

రాష్ట్ర పర్యటనలో భాగంగా నిర్మలా సీతారామన్ గురువారం పూరీ సందర్శించి జగన్నాథ స్వామిని దర్శించుకోనున్నారు. అనంతరం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి పూరీ, భువనేశ్వర్‌లోని పలు ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాలకు హాజరుకానున్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: రక్తదానంతో ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేయవచ్చని ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి అన్నారు. బొరిగుమ్మ సమితి జనారోగ్య సమితి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కుమిలి ప్రాథమిక వైద్య కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో 80 యూనిట్ల రక్తం సేకరించినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్‌తో పాటు జనారోగ్య సమితి కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



భాస్కర్ రైతా (ఫైల్)

రాయగడ: జిల్లా అదనపు కలెక్టర్‌గా భాస్కర్ రైతా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఆయన నవరంగపూర్‌లో ఏడీఎంగా విధులు నిర్వహిస్తుండేవారు. ఇప్పటివరకు అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించిన ధర్మానంద బెహర దేవఘడ్ ఏడీఎంగా బదిలీ కావడంతో ఆ స్థానంలో రైతా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

కపిలేశ్వర ఆలయం.. జాతీయ స్మారకం



ఖుర్దా జిల్లా కపిలేశ్వర్ ప్రాంతంలోని కపిలేశ్వర స్వామి ఆలయానికి జాతీయ స్మారక గుర్తింపు లభించింది. ఈ నేపథ్యంలో ఈ ప్రాచీన ఆలయం సంరక్షణ బాధ్యతలను భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) నిర్వహిస్తుంది. ఈ మేరకు 2 నెలల గడువుతో లోగడ జారీ చేసిన అభ్యంతర ఉత్తర్వులపై ఎటువంటి వ్యతిరేకత వ్యక్తం కాకపోవడంతో, ఈ గుర్తింపు కేటాయించినట్లు కేంద్ర సంస్కృతి శాఖ, భారత పురావస్తు శాఖ అధికారికంగా ప్రకటించింది. - భువనేశ్వర్

చిన్నారికి చేయూత



కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న సేవా సంఘ సభ్యులు

రణస్థలం: మండలంలోని జీరుపాలెం పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి వాసుపల్లి ఎర్రయ్య దంపతుల రెండున్నర నెలల పాప గుండె సంబంధిత సమస్యతో బాధపడుతోంది. ఆపరేషన్ కోసం రూ.6లక్షలకు పైగా ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. విషయం తెలుసుకున్న 'చేయి చేయి కలుపుదాం' సేవా సంఘం ప్రతినిధులు తమ వంతుగా లక్షా యాభై వేలు రూపాయలు సేకరించి కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో రణస్థలం వైస్ ఎంపీపీ మైలపల్లి కామరాజు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు సీఈఓ



ఆదిత్యాలయంలో మూర్తి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు సీఈఓ పులిగెడ్డ వెంకట నర్సింహమూర్తి కుటుంబసమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఆల య అధికారులు, పాలకమండలి సభ్యురాలు ద్వారపు అనూరాధ అజిత్‌కుమార్‌లు స్వాగ తం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సభ్యులు వివరించారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ గుడ్ల రమణమూర్తి, డిప్యూటీ మేనేజర్ మణిపాత్రుని సతీష్‌బాబు పాల్గొన్నారు.

62 మద్యం బాటిళ్ల సీజ్



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో సీఐ, ఎస్ఐలు

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధిలోని పెద్దపేట వీధిలో బుధవారం నిర్వహించిన దాడుల్లో జామి గోవిందరావు వద్ద 62 మద్యం బాటిళ్లు లభించాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఏఎస్ దొర తెలిపారు. బాటిళ్లను సీజ్ చేసి గోవిందరావును అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఐ సంధ్యారాణి, సిబ్బంది ఎస్.ధర్మరాజు, ఎస్.వి.రమణ, కె.ఉమాపతి తదితరులు పాల్గొన్నారు. చట్ట విరుద్ధంగా మద్యం విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాలిబాటలు.. దిగుబడికి రాచబాటలు

- ఖరీఫ్ వరిసాగులో అవలంబిస్తే మేలు
- సుడిదోమ నివారణకు చక్కటి ప్రత్యామ్నాయం
- ఎరువులు, పురుగు మందుల వాడకానికి అనుకూల మార్గం



పాతకొజ్జీరియాలో రైతు ఉప్పాడ వాసుదేవరావు పొలంలో కాలిబాటలతో కూడిన వరిపైరు

కవిటి: ఖరీఫ్ వరిసాగులో కాలిబాటలు(పాయలు)గా పిలిచే సాగుపద్ధతికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఈ ప్రక్రియను వ్యవసాయ శాస్త్రవేత్తలు మూడు దశాబ్దాల క్రితం నుంచి సిఫారసు చేస్తున్నారు. ఫలితాలు కూడా అద్భుతంగా ఉన్నాయని పలువురు అభ్యుదయ రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో తూర్పు పడమరగా, రబీ సీజన్‌లో ఉత్తర దక్షిణ దిశలుగా కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 20 సెంటీమీటర్ల వెడల్పుతో ప్రతిరెండు మీటర్ల నిడివికి ఒకటి చొప్పున ప్రధానపొలం అంతటా బాటలు తీయాలి. కాలిబాటలు తీసేటప్పుడు అక్కడ నాటిని మొనలు తగ్గిపోయి దిగుబడి తగ్గుతుందనే అపోహ ఇప్పటికీ పలువురు రైతుల్లో నెలకొంది. కానీ 20 సెంటీమీటర్ల ప్రాంతంలో తీసిన మొనలు పక్కనున్న ఖాళీల్లో నాటుతారు. కావున దిగుబడిపై ఎటువంటి ప్రతికూల ప్రభావాలు ఉండవు.

రైతుల్లో ఆసక్తి ఉండాలి..



సుడిదోమ నివారించడంలో ముందస్తుగా నాట్లు వేసినపుడే కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలనే ఆసక్తి రైతుల్లో ఉండాలి. అవసరమైతే ఇద్దరు కూలీలను అదనంగా పెట్టాల్సి ఉంటుంది. కానీ సుడిదోమ నివారణ, ఇతర ఉపయోగాలు పొందేందుకు కాలిబాటల ఏర్పాటు ఎంతో మంచి పద్ధతి.

– బొర్ర నరసింహమూర్తి, వ్యవసాయాధికారి

ఇరవై ఏళ్లుగా..



ఖరీఫ్ వరిసాగు పట్ల ఎంతో శ్రద్ధ పెడతాను. వ్యవసాయశాఖ అధికారుల సూచనలు సలహాలు నిరంతరం తీసుకుంటాను. ఏటా విత్తన మార్పిడి చేస్తుంటాను. 20 ఏళ్ల వరిలో కాలిబాటలు ఏర్పాటుచేయడం అలవాటుగా మారిపోయింది. నాట్లువేసినప్పుడే ముందుగా మార్కింగ్ ఇచ్చి కాలిబాటలు ఏర్పాటు చేస్తున్నాను.ఈ విధానంలో ప్రతిఫలం కనిపిస్తోంది.

– ఉప్పాడ వాసుదేవరావు, పాతకొజ్జీరియా, కవిటి మండలం

ఉపయోగాలివే..

- పంటపొలంలో అంతర కృషిచేసేందుకు, ఎరువులు వేయటానికి, పురుగు మందులు పిచికారీ చేసే సందర్భాల్లో బాటలు వీలుగా ఉంటాయి.
- పొలం విస్తీర్ణం అంతా సమాన పరిమాణంలో ఎరువులు, పురుగు మందులు చల్లటం సాధ్యపడుతుంది.
- సెప్టెంబరు నెలాఖరునాటికి పూర్తిగా దుబ్బు చేసి వెన్ను అంకురం ఏర్పడే దశకు చేనువస్తుంది. ఆ దశలో వరి మొదలు నీటిమట్టం ఉండే ప్రదేశంలో గట్టిపడి తీపి ఎక్కువ అవుతుంది.
- కాలిబాటలు తీయకపోతే మొదలుభాగంలో చీకటిగా ఉండి వెలుతురు అందదు. ఆ ప్రదేశంలో మురుగునీరు బయటకు పోదు. దీనివల్ల చెడు వాసనతో కూడిన వాతావరణం మొదళ్లలో ఉంటుంది. ఈ పరిస్థితుల్లో సుడిదోమ ఉద్ధృతి పెరిగే అవకా శం ఉంటుంది. అటువంటి సమస్యలు రాకుండా ఉండేందుకు రైతులు నాట్లువేసేటపుడే కాలిబాటలు(పాయలు) కనీసం పది రోజుల వ్యవధిలో తీసుకోవాలి.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

టెక్కలి రూరల్: మండల కేంద్రం టెక్కలిలోని చేరివీధికి చెందిన మండల జానిమ్మ అనే మహి ళ ఇంట్లో ఈ నెల 14న జరిగిన చోరీకి సంబంధించి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. తా ను ఇంట్లో లేని సమయంలో గోడ బీరువాలోంచి తులం బంగారం (రెండు చెవుదిద్దు లు) దొంగతనానికి గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టెక్కలి ఎస్ఐ-2 రమేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. టెక్కలిలోని మండపొలం కాలనీకి చెందిన మల్లిబోయిన సతీష్, సోగ్గాడిపేటకు చెందిన బి.సోమేష్‌లు ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి బంగారం స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ-2 తెలిపారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు సరికాదు

శ్రీకాకుళం న్యూకాలనీ: అసంబద్ధమైన ఉపాధ్యాయుల సర్దుబాటు ఎంతమాత్రం సరికాదని, వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా నాయకులు తంగి మురళీమోహనరావు, రాష్ట్ర నాయకులు పప్పల రాజశేఖరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం డీఈవో కె.వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. బదిలీల్లో మిగులు ఉపాధ్యాయులగా చూపించి నిర్బంధంగా బదిలీ చేసి, మళ్లీ ఇప్పుడు అదే పాఠశాల, అదే రోజులకు మరళా ఉపాధ్యాయులు అవసరమని సర్దుబాటు చేయడమనేది ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు.

బకాయిదారుల ఆస్తుల స్వాధీనం

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రాథమిక వ్యవసాయ పరపతి కార్యాలయం ద్వారా రుణాలు పొంది తిరిగి చెల్లించని బకాయిదారుల ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు పీఏసీఎస్ సీఈఓ జగదీశ్వరరావు తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలం రిట్టపాడు, కొండవూరు, బట్టుపాడు, రెయ్యిపాడు గ్రామాలకు చెందిన నలుగురు రైతులకు రూ. 24 లక్షలు మార్ట్‌గేజ్ లన్ అందించామని, తిరిగి చెల్లించాలని నోటీసులు పంపించినా స్పందించకపోవడంతో పోలీసుల సహాయంతో బుధవారం రైతులకు సంబంధించిన భూములలో జెండాలను పెట్టి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రుణాలు చెల్లించకపోతే భూములను వేలం వేస్తామని చెప్పారు. ఆయనతో పాటు సేల్ ఆఫీసర్ టి.యర్రయ్య, మేనేజర్ డి.కృష్ణారావు, నోడల్ ఆఫీసర్ జి.సునీల్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు బొబ్బిలి రైల్వే ఎస్సై రవివర్మ, కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపారు. విజయనగరం నుంచి బొబ్బిలి వెళ్తున్న రైలు నుంచి జారి పడడంతో మృతదేహం ముక్కలు, ముక్కలైందని, వివరాలు తెలియరాలేదని, ఎవరైనా ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9441013330 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఊబిలో చిక్కుకుని రెండు ఎద్దులు..

శృంగవరపుకోట: మండలంలోని గోస్తనీ నదిలో చిక్కుకుని రెండు ఎద్దులు ప్రాణాలు వదిలాయి. వివరాలిలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం నాలుగుగంటల సమయంలో గోస్తనీ నదిలో ఇసుక కోసం దిగిన ఎద్దులబండి ప్రమాదవశాత్తు ఊబిలో చిక్కుకుపోయింది. దీంతో బండిపై ఉన్న అచ్చిబాబు కేకలు వేయగా స్థానికులు వచ్చి ఊబిలో కూరుకుపోయిన ఎద్దులను బయటకు తీశారు. అయితే అప్పటికే ఎద్దులు రెండూ మరణించాయి. ఎద్దులు రెండూ అక్కడికక్కడే చనిపోవడంతో అచ్చిబాబు ఏడుస్తూ స్పృహ కోల్పోయాడు. వర్షం లేక ఏరు పారని సమయంలో ఇసుక కోసం గోతులు తీశారని, ఏరు పారిన తర్వాత గోతులు ఎక్కడ ఉన్నాయో తెలియక మూగజీవాలు ప్రమాదాల పాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల జామి మండలం తానవరంలో ఇదే తరహా ఘటన సంభవించింది. కొంతమంది అత్యాశకు పోయి ఇష్టానుసారం గోతులు తీయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు.

దాబా దగ్ధం

• రూ.లక్షా 80వేల ఆస్తినష్టం


కాలిబూడిదైన దాబా

కొత్తవలస: మండలంలోని సంతపాలెం గ్రామం సమీపంలో గల లైట్‌హౌస్ దాబా మంగళవారం అర్ధరాత్రి అనుమానాస్పద స్థితిలో కాలిబూడిదైంది. ఈ ఘటనపై ఎస్సై వీరజనార్దన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు వ్యాపించి దాబాను చుట్టుముట్టడంతో కొత్తవలస ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందజేయగా సిబ్బంది వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ ప్రమాదం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా జరిగిందని, సుమారు రూ.లక్షా,80వేల ఆస్తినష్టం జరిగి ఉంటుందని, ఫైర్‌ఆఫీసర్ వై.అశోక్‌కుమార్ అంచనా వ్యక్తం చేశారు. అయితే అగ్నిప్రమాదంపై అనుమానాలు ఉన్నట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై వీరజనార్దన్ బుధవారం సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పూతికవలసలో పశువులశాల..

మెరకముడిదాం: మండలంలోని పూతికవలసలో గ్రామానికి చెందిన రైతు విశాఖరామారావు పశువుల శాల బుధవారం సాయంత్రం అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.40 వేల నష్టం వాటిల్లినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు నాయుడు


క్రీడాకారుడికి స్పోర్ట్స్ కిట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు

శృంగవరపుకోట: శ్రీలంక రాజధాని కొలంబోలో ఈ నెల 19 నుంచి జరగనున్న అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు మండలానికి చెందిన పి.ఎస్.నాయుడు ఎంపికయ్యాడు. ఆయనను జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుకూరి రఘురాజు బుధవారం అభినందించారు. స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు. ఇటీవల ఖరగ్‌పూర్‌లో జరిగిన జాతీయస్థాయి పోల్‌వాల్ట్‌లో 35–40 సంవత్సరాల విభాగంలో పాల్గొన్న సన్యాసినాయుడు ప్రథమస్థానం సాధించి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించినట్లు రఘురాజు చెప్పారు. విజయనగరంలో ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నాయుడు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నేటి నుంచి శ్రావణమాస ఉత్సవాలు

విజయనగరం టౌన్: పట్టణంలోని బొండాడవీధిలో కొలువైన మహాగణపతి కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి వారి దేవాలయంలో శ్రావణ మాసం సందర్భంగా ఆగస్టు 17 నుంచి ప్రతి శుక్రవారం శ్రీచక్ర సహస్ర కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు దేవాలయం పాలక మండలి అధ్యక్షుడు సోమరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 17 నుంచి వచ్చేనెల 15 వరకు శ్రావణమాస పూజలు చేయనున్నట్లు దేవస్థానం అధ్యక్షుడు నారాయణం శ్రీనివాస్ తెలిపారు.

అనారోగ్యంతో బీఎస్‌ఎఫ్ జవాన్ మృతి


ప్రసాద్ మృతదేహం వద్ద తహసీల్దార్ ఎన్వీ రమణ, ఎస్సై కె.నీలకంఠం

• ప్రభుత్వ లాంఛనాలతో వీడ్కోలు


శ్మశాన వాటికవద్ద గౌరవ వందనం చేస్తున్న బీఎస్‌ఎఫ్ అధికారులు


నగర ప్రసాద్ (ఫైల్)

సీతానగరం: మండలంలోని చినభోగిలి గ్రామానికి చెందిన బీఎస్‌ఎఫ్ జవాన్ నగర ప్రసాద్(44) అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని ఆస్పత్రిలో మంగళవారం మృతిచెందారు. ప్రసాద్ మృతదేహాన్ని సాయంత్రం స్వగ్రామం చినభోగిలికి కుటుంబీకులు తీసుకొచ్చారు. బుధవారం జరిగిన ఆయన అంత్యక్రియల్లో బోర్డర్ సెక్యూరిటీ సిబ్బంది, స్థానిక అధికారులు పాల్గొని అధికారిక లాంఛనాలతో నిర్వహించి వీడ్కోలు పలికారు. ముందుగా ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం శ్మశాన వాటిక వద్ద బీఎస్‌ఎఫ్‌కు చెందిన కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్, సిబ్బంది పాల్గొని ఆయన భార్యకు జాతీయ పతాకాన్ని అందజేశారు. గార్డు ఆఫ్ హానర్ కార్యక్రమాన్ని నిర్వహించాక అంత్యక్రియలు పూర్తిచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్వీరమణ, ఎస్సై కె.నీలకంఠం, ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, సర్పంచ్ కురమాన రాధ, గ్రామ వీఆర్‌ఓ ఎస్ లక్ష్మి, కుటుంబ సభ్యులు,స్నేహితులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

కుటుంబసభ్యుల రోదన

ప్రసాద్ గుజరాత్ రాష్ట్రంలోని పనిచేస్తున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. 23ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రసాద్ సెలవుపై జూలై 30న ఇంటికి చేరుకున్నారని భార్య తెలిపారు. మృతి చెందిన ప్రసాద్‌కు తల్లిదండ్రులు గంగయ్య, సీతమ్మతో పాటు భార్య పవిత్ర, కుమారుడు అక్షయ్ కుమార్, కుమార్తె ఉన్నారు. కుటుంబాన్ని పోషిస్తున్న ప్రసాద్ మృతిచెందడాన్ని జీర్ణించుకోలేకోపోయిన కుటుంబసభ్యులు భోరున విలపించారు.

వాహనాల తనిఖీలో 78 మద్యం సీసాల పట్టివేత


స్వాధీనం చేసుకున్న మద్యంబాటిల్స్, స్కూటీతో ఎస్సై రాజేష్

గరుగుబిల్లి: వాహనాలు తనిఖీచేస్తున్న సమయంలో అక్రమంగా తరలిస్తున్న వాహనాలను, 78 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకోవడంతోపాటు ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎం.రాజేష్ బుధవారం తెలిపారు. దళాయివలస జంక్షన్‌లో వాహనాల తనిఖీచేస్తున్న సమయంలో దళాయివలసకు చెందిన ఒక వ్యక్తి దగ్గర ఎనిమిది మద్యం బాటిల్స్, బీవీ పురానికి చెందిన ఇద్దరు వ్యక్తుల దగ్గర 30 బాటిల్స్, ఒక ద్విచక్ర వాహనం, ఉల్లిభద్ర గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నుంచి 28 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే వంగర మండలం బంగారువలసకు చెందిన ఒకరు 12 మద్యం బాటిల్స్, రవాణాకు వినియోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసులు నమోదుచేసి మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

సీతంపేటలో 15 మద్యం బాటిల్స్..

సీతంపేట: సీతంపేటలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తినుంచి 15 మద్యం బాటిల్స్ బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. మెయిన్‌రోడ్డు పక్కన ఉన్న షాపులో మద్యం విక్రయిస్తున్న బి.నారాయణరావును కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై చెప్పారు.

ఆటోను లారీ ఢీకొని ఐదుగురికి గాయాలు


చికిత్సపొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురం: ఆగి ఉన్న ఆటోను వెనుకనుంచి లారీ ఢీకొనడంతో ఐదుగురు గాయాలపాలయ్యారు. ఈ మేరకు పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండల కేంద్రానికి చెందిన ఆటోడ్రైవర్ వాసిరెడ్డి వెంకటనాయుడు పార్వతీపురం నుంచి కాశీపేటకు నలుగురు పాసింజర్లను ఎక్కించుకుని వెళ్తా నర్సిపురం సమీపంలో విజయబ్యాంకు దగ్గర పాసింజర్‌ను దింపేందుకు ఆటో ఆపాడు. అదే సమయంలో పార్వతీపురం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న లారీ వెనుకనుంచి ఆటోను బలంగా ఢీకొంది. దీంతో ఆటో బోల్తాపడడంతో పాటు ప్రయాణికులకు పలు చోట్ల గాయాలయ్యాయి. గాయాల పాలైన ప్రయాణికులను 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు. గాయాలపాలైన వారిలో బంగారంపేటకు చెందిన తాన్న వాసు, వైకేఎం కాలనీకిచెందిన ఎస్.రాజేశ్వరి, పి.జానకి, బరదవెంకటాపురానికి చెందిన పల్లా లక్ష్మితో పాటు ఆటో డ్రైవర్ వాసిరెడ్డి వెంకటనాయుడులున్నారు.

రెండు బైక్‌లు ఢీ కొని ఇద్దరికి..

మక్కువ: మండలంలోని కొండబుచ్చెంపేట గ్రామ సమీపంలో బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. శంబర గ్రామానికి చెందిన నైదాన సాయి కృష్ణ మక్కువ నుంచి శంబర వెళ్తుండగా మక్కువ–దుగ్గేరు రహదారి నుంచి శంబర గ్రామానికి చెందిన బోను లోకేష్ బైక్‌పై వస్తుండగా ఎదురెదురుగా ఢీకొని గాయాలపాలయ్యారు. సాయికృష్ణకు కుడి కాలు విరిగిపోగా, కుడి భుజానికి గాయాలయ్యాయి. లోకేష్‌కు కుడి కాలికి గాయం కాగా, ఇద్దరినీ చికిత్స నిమిత్తం మక్కువ పీహెచ్‌సీకి స్థానికులు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య చికిత్స కోసం విజయనగరం లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు.


గాయాలపాలైన సాయికృష్ణ, లోకేష్

జగనన్నతోనే సంక్షేమం

రామభద్రపురం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మా లాంటి వలసజీవులకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ఠంచన్‌గా అందుతున్నాయని నేరళ్లవలస సచివాలయం పరిధిలోని తంగినిగుడ్డివలస గిరిజనులు పాముల లక్ష్మణరావు, మర్రి శ్రీను, వంతల సూరయ్య, మర్రి లక్ష్మణ, జె.రమేష్, వై.సూరన్న తెలిపారు. సుమారు 20 ఏళ్ల కిందట ఒడిశా రాష్ట్రం నుంచి వలస వచ్చామని, నాలుగేళ్లుగా పథకాలు అందుతుండడంతో ఆర్థికోన్నతి చెందుతున్నామన్నారు. వలంటీర్లే వచ్చి పింఛన్లు, రేషన్ సరుకులు, ఇతర ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్టు వెల్లడించారు. మా పిల్లల చదువులకు ఆర్థిక అండ దొరికిందంటూ సంతోషం వ్యక్తంచేశారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన


కృష్ణపల్లిలోని జగనన్న కాలనీను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణం కృష్ణపల్లిలోని వైఎస్సార్ జగనన్నకాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ నిషాంత్‌కుమార్ బుధవారం పరిశీలించారు. మౌలిక సదుపాయాల పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేసి, గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వం ఇళ్ల బిల్లులతో పాటు రాయితీపై నిర్మాణ సామగ్రిని సమకూర్చుతున్న విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, ఆర్డీఓ కె.హేమలత, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎంవీఆర్ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, ఎలక్ట్రికల్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

8వేల మెట్రిక్ టన్నుల రొయ్యల ఎగుమతి

• నాస్కా మేనేజర్ రాము


కోనాడలో ఆక్వారైతులకు అవగాహన కల్పిస్తున్న నాస్కా మేనేజర్ రాము, తదితరులు

పూసపాటిరేగ: ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఏటా 8 వేల మెట్రిక్ టన్నుల రొయ్యలు ఎగుమతి చేయడమే లక్ష్యంగా సాగును ప్రోత్సహిస్తున్నా మని ఉత్తరాంధ్ర జిల్లాల నాస్కా (నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ ఆక్వా కల్చర్) మేనేజర్ పి. రాము అన్నారు. మండలంలోని తీరప్రాంత గ్రామమైన కోనాడలో ఆక్వాచెరువులను బుధ వారం పరిశీలించారు. రొయ్యల పెంపకంపై రైతులకు పలు సూచనలు చేశారు. సరైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కొన్నిచోట్ల రైతులకు అవగాహన లేకపోవడంతో రొయ్యల సాగు నష్టాల ను తెచ్చిపెడుతోందన్నారు. రొయ్య పిల్లలను చెరువుల్లో వేసేముందు ప్లవకాలును అభివృద్ధి చేయాలని సూచించారు. ఆక్వా చెరువులో నీరుపెట్టిన తరువాత హేచరీల నుంచి తెచ్చిన సీడ్‌ను నేరుగా వేయకూడదన్నారు. సీడ్‌కు పీసీఆర్ పరీక్షలు చేసి వైరస్ ఉందో లేదో గుర్తించా లని సూచించారు. రొయ్య పిల్లలకు తొలిదశ లో సహజమైన ఆహారాన్ని అందించాలన్నారు. అధిక మోతాదులో ఆహారం వేస్తే చెరువుల అడుగుభాగంలోకి చేరి విషపూరితంగా మారి రొయ్యలు చనిపోయే అవకాశం ఉందని రైతులకు హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు ఎల్లాజీ, మాజీ సర్పంచ్ దంగా భూలోక, మోడల్ ఆక్వారైతు చింతలపాటి శ్రీనివాసరాజుతో పాటు పలువురు ఆక్వా రైతులు పాల్గొన్నారు.

పారదర్శక పాలన

• డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర


కొత్తవలస గ్రామంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పాచిపెంట:

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పారదర్శక పాలనను చేరువ చేశారని, సంక్షేమ పథకాల ఆర్థిక లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమచేసే వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పాచిపెంట మండలం కొటికిపెంట పంచాయతీ పరిధిలోని కొత్తవలస గ్రామంలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం ముగింపు సభలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలుకాని సంక్షేమ పథకాలను మన ప్రభుత్వం అందిస్తోందని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా, కులమత బేధం చూడకుండా, అవినీతి రహితంగా పథకాలు అమలుచేస్తున్నట్టు తెలిపారు. పాచిపెంట మండలంలోని లబ్ధిదారులకు వివిధ పథకాల కింద నాలుగేళ్లలో సుమారు రూ.175 కోట్ల ఆర్థిక ప్రయోజనం కల్పించినట్టు వెల్లడించారు. ఒక్క కొటికిపెంట సచివాలయ పరిధిలో 9,420 మంది లబ్ధిదారులకు రూ.12కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. స్థానికులు పలువురు మాట్లాడుతూ రాజన్నదొర కృషితో గ్రామానికి వంతెన నిర్మాణం జరిగిందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, 2024లో జరగనున్న ఎన్నికల్లో రాజన్న దొరకు అండగా నిలుస్తామని స్పష్టంచేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని షెడ్యూల్‌ప్రకారం పూర్తిచేసినందుకు ఎంపీడీఓ పార్వతిని డిప్యూటీ సీఎం సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బడ్నాన ప్రమీల, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జి, పార్టీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు, వైస్ ఎంపీపీ మీసాల నారాయణమ్మ, మాజీ వైస్ ఎంపీపీ తట్టికాయలు గౌరీశ్వరరావు, సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, నాయకులు మాదిరెడ్డి మధుసూదనరావు, చంద్రినాయుడు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

'పైడితల్లి' హుండీల ఆదాయం లెక్కింపు


ఆదాయ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈఓ కేఎల్.సుధారాణి తదితరులు


ట్రస్ట్ బోర్డు సభ్యులతో మాట్లాడుతున్న దేవాదాయ శాఖ జిల్లా సహాయక కమిషనర్ అన్నపూర్ణ

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు హుండీల ఆదాయం లెక్కింపును స్థానిక పైడితల్లి అమ్మవారి ఆలయంలోని కల్యాణ మంటపంలో అధికారుల సమక్షంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారిణి కేఎల్.సుధారాణి మాట్లాడుతూ అమ్మవారి వనంగుడి, చదురుగుడి హుండీల నుంచి 77 రోజులకు గాను వనంగుడి నుంచి రూ.6 లక్షల 25వేల 224 నగదు, 3 గ్రాముల బంగారం, 176 గ్రాముల వెండి లభించాయన్నారు. అదేవిధంగా చదురుగుడి హుండీల నుంచి రూ.27 లక్షల 46వేల 569 నగదు, 34.180 గ్రాముల బంగారం, 271 గ్రాముల వెండి లభించాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ, దేవాదాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్కార్ట్ లేకుండానే హుండీల తరలింపు

పైడితల్లి అమ్మవారి హుండీల ఆదాయం లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ముందుగా చదురుగుడి హుండీలను కల్యాణ మంటపానికి తీసుకువస్తారు. అలా కాకుండా రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి హుండీలను మూటలుగా కట్టి ప్రైవేట్ వ్యాన్‌ద్వారా ఎటువంటి పోలీస్ ఎస్కార్ట్ లేకుండా దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బందితోనే చదురుగుడికి తరలించారు. ట్రస్ట్ బోర్డు మెంబర్లు, స్థానికులు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జరగరానిదేదైనా జరిగితే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. చదురుగుడి, వనంగుడిల నుంచి హుండీలు తరలిస్తున్న సమయంలో పోలీసు ఎస్కార్ట్ లేకపోవడమేంటని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు నిర్లక్ష్యవైఖరి ప్రదర్శించడం తగదన్నారు. ఈ విషయమై జిల్లా సహాయక కమిషనర్ అన్నపూర్ణ మాట్లాడుతూ పోలీసులకు ముందుగానే సమాచారమిచ్చామని, వారు వచ్చేందుకు సమయం ఆలస్యమవ్వడంతో ఎప్పటిలానే తనతో పాటు దేవాదాయశాఖ అధికారులతో కల్యాణ మంటపానికి తీసుకువచ్చామన్నారు. ఎటువంటి అవకతవకలు జరగలేదని, అన్నీ పక్కాగానే ఉన్నాయని చెప్పారు. వచ్చే నెల నుంచి చేపట్టబోయే హుండీల లెక్కింపులన్నీ పోలీస్ డిపార్ట్‌మెంట్ సహకారంతో ఎక్కడికక్కడే చేపట్టనున్నామని తెలిపారు. ప్రతి బ్యాగ్‌కు సీల్ వేయిస్తామని, ట్యాంపరింగ్ చేయడానికి అవకాశం లేదని వివరించడంతో ట్రస్ట్ బోర్డు సభ్యులు శాంతించారు.

దేశ సర్వతోముఖాభివృద్ధి లీడ్‌ఇండియా లక్ష్యం

• ప్రొఫెసర్ ఎన్.బి.సుదర్శన్ ఆచార్య


కార్యక్రమంలో మాట్లాడుతున్న సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.బి.సుదర్శన్ ఆచార్య

విజయనగరం: దేశ సర్వతోముఖాభివృద్ధి లీడ్‌ఇండియా ముఖ్య ఉద్దేశమని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.బి.సుదర్శన్ ఆచార్య పేర్కొన్నారు. యువతకు లీడ్ ఇండియా ఐదు రోజుల శిక్షణ శిబిరాన్ని పట్టణంలోని కణపాక యూత్ హాస్టల్‌లో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత ఉత్తేజవంతమై అన్ని రంగాలలో అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. ప్రభుత్వం, రోటరీ క్లబ్ సహకారంతో ఉచితంగా నిరుద్యోగ యువతకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఉమామహేష్ మాట్లాడుతూ 'నీ అభివృద్ధే దేశాభివృద్ధి' అనే నినాదంతో ఈ శిక్షణ అనంతరం నిరుద్యోగ యువతకు లీడ్ ఇండియా ట్రైనర్స్‌గా గౌరవ వేతనంతో అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వరరావు, ముఖ్య సలహాదారు, ఆడిటర్ బాలాజీ, సమన్వయ కర్త జ్ఞానేశ్వర్ గురూజీ, యోగా గురువు శశిభూషణ్ గురూజీ, రామ్మూర్తి, హేమసుందర్, శ్రీనివాస్, కుమారస్వామి, వింధ్య, శిక్షకులు శ్రీనివాసచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి యువత హాజరయ్యారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు కానుక

• క్రమబద్ధీకరణకు ఐదేళ్ల నిబంధన తొలగింపు

విజయనగరం అర్బన్: కాంట్రాక్ట్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్వాతంత్య్ర దినోత్సవ కానుక ప్రకటించారు. కొన్ని నిబంధనలు తొలగించి కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతకం చేయడంపై వైద్యారోగ్య పారామెడికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కమిటీ హర్షం వెలిబుచ్చింది. ఈ మేరకు కమిటీ ప్రతినిధి వీవీఎస్‌ఆర్ ప్రసాద్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 2014 జూన్ 2 నాటికి 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని గత క్యాబినెట్‌లో తీర్మానం చేశారని, అయితే వీలైనంత ఎక్కువ మందిని రెగ్యులర్ చేయాలనే ఉద్దేశంతో స్వయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 5 సంవత్సరాల నిబంధనను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ ప్రకారం 2014 జూన్ 2 ముందు నియమితులై, ఇప్పటి వరకు కొనసాగుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు అందరినీ రెగ్యులర్ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఫైలుపై ముఖ్యమంత్రి స్వాతంత్య్ర దినోత్సవం రోజు సంతకం చేశారని, ఉత్తర్వులు త్వరలో వెలువడతాయన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి రాష్ట్రంలోని కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగులందరి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

ప్రాధాన్య భవనాల నిర్మాణం పూర్తిచేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: నిర్మాణాలు పూర్తి కావస్తున్న భవనాల చివరి దశ పనులను పూర్తిచేసి పది రోజుల్లో అప్పగించాలని ఇంజినీరింగ్ అధికారులను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా విభాగం ఇంజినీర్లతో నిర్వహించిన సమావేశంలో ప్రాధాన్యతా భవనాలు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చేపట్టిన పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 14నాటికి నిర్మాణాలు పూర్తిచేసుకున్న భవనాలను ఇంతవరకు అప్పగించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల పురోగతిపై నిర్లక్ష్యం వహించిన ఇంజినీర్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు కోరిన పనులకు రూ.36 కోట్లు మంజూరు చేశామని, ఇంతవరకు రూ.4 కోట్లతో మాత్రమే పనులు చేపట్టారని, పనులను వేగవంతం చేసేందుకు సర్పంచ్‌లు, టెక్నికల్ సహాయకులతో సమావేశాలు నిర్వహించి ప్రణాళికలు తయారు చేసి, ఈ నెలాఖరుకు 25 శాతం పనులు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, పీఆర్ ఎస్ఈ ఎంవీఆర్ కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల పోటీ

• ఎన్‌క్వాష్ సర్టిఫికెట్ ఉంటే రూ.3 లక్షల ప్రోత్సాహకం



ఎన్‌క్వాష్ సర్టిఫికెట్ సాధించిన బాడంగి మండలంలోని వాడాడ పీహెచ్‌సీ

విజయనగరం ఫోర్ట్: నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ (ఎన్‌క్వాష్) సర్టిఫికెట్ కోసం జిల్లాలోని పీహెచ్‌సీలు పోటీపడుతున్నాయి. ఎన్‌క్వాష్ సర్టిఫికెట్ వచ్చిన పీహెచ్‌సీలకు ప్రభుత్వం ప్రోత్సాహకం ఇస్తుండడంతో జిల్లాలోని పీహెచ్‌సీలు ఆ సర్టిఫికెట్ సాధించడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకంతో ఆస్పత్రి అభివృద్ధి చేసుకోవడంతో సిబ్బంది కూడా ప్రోత్సాహకంలో 25 శాతం వినియోగించుకోవచ్చు. నాణ్యమైన సేవలు అందించే పీహెచ్‌సీలకు మాత్రమే ఎన్‌క్వాష్ సర్టిఫికెట్ ఇస్తారు.

ఆరు అంశాల ఆధారంగా సర్టిఫికెట్

పీహెచ్‌సీకి ఎన్‌క్వాష్ సర్టిఫికెట్ ఆరు అంశాల ఆధారంగా జారీ చేస్తారు. ఆపరేషన్ థియేటర్, కాన్పుగది నిర్వహణ, ఇన్‌పేషెంట్ సేవలు, ల్యాబొరేటరీ సేవలు, నేషనల్ హెల్త్ కార్యక్రమాలు, జనరల్ అడ్మినిస్ట్రేటివ్ అధారంగా ఎన్‌క్వాష్ సర్టిఫికెట్ మంజూరవుతుంది. జిల్లాలో 48 పీహెచ్‌సీలు ఉండగా వాటిలో 21 పీహెచ్‌సీలకు ఎన్‌క్వాష్ సర్టిఫికెట్ ఇప్పటికే వచ్చింది. మిగిలిన 27 పీహెచ్‌సీలు సర్టిఫికెట్ కోసం ప్రయత్నిస్తున్నాయి.

సర్టిఫికెట్‌తో నిధులు



జిల్లాలో ఉన్న అన్ని పీహెచ్‌సీలు ఎన్‌క్వాష్ సర్టిఫికెట్ సాధించేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 21 పీహెచ్‌సీలు సాధించాయి. సర్టిఫికెట్ వల్ల వచ్చే నిధులతో పీహెచ్‌సీ అభివృద్ధి పనులు చేపట్టడానికి అవకాశం ఉంటుంది.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

సర్టిఫికెట్ సాధించిన పీహెచ్‌సీలు

పక్కి, రామభద్రపురం, బొద్దాం, గంట్యాడ, పెదమజ్జిపాలెం, పూసపాటిరేగ, పోలిపల్లి, పెరుమాళి, తెర్లాం, మండాకురిటి, డెంకాడ, ఆర్.ఆమదాలవలస, పిరిడి, గుర్ల, గర్భాం, పొగిరి, వేపాడ, వాడాడ, గరివిడి, సతివాడ, సంతకవిటి ఉన్నాయి.